సాక్షి కామారెడ్డి

శనివారం : 22 : ఏప్రిల్ : 2023



రెగ్యులరైజ్ చేయాలి

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించకపోతే సమ్మె చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రకటించారు.

- IIలో ▸



ధాన్యాన్ని పూర్తిగా కొంటాం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
42.3 /21.1

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రంజాన్ శుభాకాంక్షలు





సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం వారు వేరువేరుగా ప్రకటనలు జారీ చేశారు. రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు.

రేపు గురుకుల ప్రవేశపరీక్ష

భిక్కనూరు: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు భిక్కనూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 420 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 10 గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

'ప్రయాణికులను గౌరవించాలి'



కామారెడ్డి టౌన్: ప్రయాణికులే ఆర్టీసీ సంపదని, వారిని సర్, మేడమ్ అని గౌరవంగా సంబోధించాలని కామారెడ్డి డిపో మేనేజర్ లక్కు మల్లేషం సూచించారు. శుక్రవారం డిపోలో 30 మంది కండక్టర్లకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు బస్ ఎక్కేటప్పుడు, దిగేప్పుడు సహకరించాలని సూచించారు. ప్రయాణికులకు ఆర్టీసీ సేవలను వివరించాలని సూచించారు.

5,159 మందికి కంటి పరీక్షలు


కామారెడ్డి టౌన్: జిల్లాలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాల్లో 5,159 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 480 మందికి కంటి అద్దాలను అందించారు. జిల్లాలో ఇప్పటివరకు 3,26,860 మందికి కంటి పరీక్షలు చేసి, 48,816 మందికి కంటి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

'విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా'

కామారెడ్డి టౌన్: విద్యుత్ శాఖ అత్యవసర సేవల కిందకు వస్తుందని, శాఖలో సమ్మెలు నిషిద్ధమని ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్‌లను పరిష్కరించాలంటూ విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లు ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి స్పందించారు. ఉద్యోగులకు ఎస్మా కింద నోటీసులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో 200ల మందికిపైగా ఆర్టిజన్ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతున్నారు.

ఇందూరుతో తెగుతున్న బంధం

- జిల్లాల విభజనతో మొదలైన దూరం..
- వేర్వేరు జోన్లలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు
- 317 జీవోతో సొంత జిల్లాలకు ఉద్యోగులు
- పోలీసు శాఖలో కరీంనగర్ రేంజ్‌లోకి కామారెడ్డి జిల్లా
- ఇతర శాఖలు ఒక్కొక్కటిగా సర్దుబాటు..



సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో నిజామాబాద్ జిల్లా రెండుగా విడిపోయింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని దాదాపు సగభాగంతో కొత్తగా కామారెడ్డి జిల్లా ఆవిర్భవించింది. కలెక్టరేట్‌తోపాటు పలు విభాగాలు ఉమ్మడి జిల్లానుంచి వేరయ్యాయి. కామారెడ్డిలో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తర్వాత కాలంలో జిల్లా పరిషత్ వేరయ్యింది. కామారెడ్డిలో జిల్లాకోర్టు ఏర్పాటయ్యింది. తర్వాత ప్రభుత్వం జోన్లను కూడా మార్చింది. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా బాసర జోన్‌లోకి, కామారెడ్డి జిల్లా రాజన్న జోన్‌లోకి వెళ్లాయి. దీంతో రెండు జిల్లాల మధ్య మరింత దూరం పెరిగింది.

ఇప్పటికే కొన్ని శాఖలు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉన్న కార్యాలయాల నుంచి బయటకు వచ్చేశాయి. పోలీసు, రెవెన్యూ, న్యాయ శాఖలు ఎప్పుడో విడిపోయాయి. ఇంకా కొన్ని ఉమ్మడి జిల్లాగా కొనసాగుతున్నాయి. అవి కూడా ఒక్కొక్కటిగా విడిపోతున్నాయి. దీంతో నిజామాబాద్ జిల్లాతో ఉన్న అనుబంధం తెగిపోతోంది. బంధుత్వాల కోసమో, ఇతర అవసరాల కోసమో తప్ప, అధికారిక వ్యవహారాల విషయంలో జిల్లాకు చెందిన ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కూడా ఇందూరుతో బంధం కొనసాగించే అవకాశాలు తగ్గిపోయాయి. బాన్సువాడ నియోజకవర్గం రెండు జిల్లాల్లో కలిసి ఉండడంతో ఆ నియోజకవర్గం వారికి మాత్రమే నిజామాబాద్‌తో అనుబంధం కొనసాగనుంది. అలాగే 317 జీవోతో ఉద్యోగులు చాలా వరకు సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. కొద్దిమంది మాత్రమే ఇక్కడి వారు అక్కడ, అక్కడివారు ఇక్కడ ఉండిపోయారు.

పోలీసు శాఖలో..

పోలీసు శాఖకు సంబంధించి కామారెడ్డి జిల్లా మొన్నటివరకు నిజామాబాద్ రేంజ్ పరిధిలోనే కొనసాగింది. కొత్త జోన్లు అమలులోకి వచ్చిన తర్వాత కామారెడ్డి జిల్లా కరీంనగర్ రేంజ్‌లోకి వెళ్లింది. దీంతో కరీంనగర్ రేంజ్ డీఐజీ ఆధీనంలో జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. ఎన్నో ఏళ్లుగా నిజామాబాద్ రేంజ్‌లో కొనసాగిన పోలీసు శాఖ ఆ జిల్లాతో బంధాన్ని తెంచుకోవాల్సి వచ్చింది. పోలీసు శాఖలోని ఏసీబీ మినహా మిగతా విభాగాలన్నీ రెండుగా విడిపోయాయి. కామారెడ్డి జిల్లా ఏర్పడకముందు పోలీసు శాఖలో ఎస్సైలు, సీఐలు చాలామంది ఉమ్మడి జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్లలో పనిచేసేవారు. జిల్లాలు విడిపోవడం, కొత్త జోన్లు ఆపై 317 జీవోతో చాలామంది పోలీసు అధికారులు సొంత జిల్లాలకు వెళ్లిపోయారు.

మిగిలిన సహకార బ్యాంకు విభజన..

సహకార బ్యాంకు ఉమ్మడి జిల్లా పరిధిలోనే కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలవారీగా సహకార బ్యాంకులను ఏర్పాటు చేయడానికి భారీ కసరత్తే చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. బ్యాంకు విభజన ప్రక్రియకు నాబార్డు అనుమతులు అవసరం. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకు విభజన ఇప్పట్లో జరిగే అవకాశాలు లేవు.

నీటి పారుదల శాఖ సర్కిల్..

కామారెడ్డి జిల్లాలో నీటి పారుదల శాఖ సర్కిల్ ఏర్పాటైంది. ఇక్కడే చీఫ్ ఇంజినీర్ ఉంటారు. మిగతా ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన విభజన కసరత్తు జరుగుతోంది.

న్యాయ వ్యవస్థలో...

జిల్లా న్యాయస్థానం ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉండేది. ఉమ్మడి జిల్లాలోని న్యాయస్థానాలన్నీ నిజామాబాద్‌లోని జిల్లా న్యాయమూర్తి ఆధీనంలో పనిచేశాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలన్నింటిలోనూ జిల్లా న్యాయ స్థానాలను ఏర్పాటు చేసింది. దీంతో కామారెడ్డి జిల్లాకు సంబంధించిన కోర్టులన్నీ కామారెడ్డిలోని జిల్లా న్యాయమూర్తి ఆధీనంలోకి వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన కోర్టు, కన్జూమర్స్ కోర్టులు మాత్రం ఇంకా ఉమ్మడిగా ఉన్నాయి.

ఔషధ నియంత్రణ శాఖలోనూ మార్పులు

మొన్నటి వరకు ఔషధ నియంత్రణ శాఖలో నిజామాబాద్ కేంద్రంగా అసిస్టెంట్ డైరెక్టర్ కంట్రోల్‌లో ఉమ్మడి జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పనిచేసేవారు. కొత్త జోన్లతో కామారెడ్డి జిల్లాకు సంబంధించిన వ్యవహారాలన్నీ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అనుసంధానం అయ్యాయి. అక్కడి డైరెక్టర్ ఆధీనంలో పనిచేస్తున్నారు. దీంతో ఔషధ నియంత్రణ శాఖలోనూ నిజామాబాద్‌తో అనుబంధం తెగిపోయింది.

కోనాపూర్ పాఠశాల భవనం పరిశీలన



పాఠశాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ పాటిల్

బీబీపేట: మంత్రి కేటీఆర్ నాయినమ్మ సొంత గ్రామమైన కోనాపూర్‌లో నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. పనుల నాణ్యతను పరిశీలించారు. విద్యుత్ బిల్లు ఆదా కోసం ప్రత్యేకంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో తాగునీటి కోసం ప్రత్యేకంగా పైపులైన్ వేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ స్వామి, తహసీల్దార్ నర్సింలు, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బసవ జయంతిని ఘనంగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఈనెల 23న నిర్వహించే బసవ జయంతికి అన్ని వర్గాల ప్రతినిధులను ఆహ్వానించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, బహుజన సంఘాల ప్రతినిధులతో బసవ జయంతి వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అధికారులు, వీరశైవ జంగం సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేలి'ముద్ర' పడుతలేదు

- పింఛన్లు అందక పండుటాకుల అవస్థలు
- ముందుగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలంటున్న లబ్ధిదారులు

భిక్కనూరు: పండుటాకులను పింఛన్ కష్టాలు వెన్నాడుతున్నాయి. బయోమెట్రిక్ విధానంలో వేలి ముద్రలు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో ఆసరా పథకం ద్వారా 1,69,986 మందికి సామాజిక పెన్షన్లు అందుతున్నాయి. వారికోసం నెలకు రూ.36.15 కోట్లు వెచ్చిస్తున్నారు. అయితే వృద్ధాప్యంతోపాటు చిన్నప్పటి నుంచి వ్యవసాయ పనులు, ఇంటి పనులు, వంట పనులు చేసిన చాలామందికి రేఖలు చెరిగిపోయి వేలుముద్రలు సరిగా రావడం లేదు. పింఛన్ తీసుకోవాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి.. కానీ చాలామందికి వేలిముద్రలు రావడం లేదు. ఇలాంటి వారికి పంచాయతీ కార్యదర్శి వేలిముద్రకు అటాచ్ చేసి ఇస్తున్నారు. అయితే పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండకపోవడంతో రోజుల తరబడి పింఛన్ కోసం లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితులున్నాయి. జిల్లాలో ఐదు వేల మందికిపైగా వేలిముద్రలు రావడం లేదని తెలుస్తోంది. వారంతా రోజుల తరబడి పెన్షన్ డబ్బుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. వేలిముద్రలు రానివారికి ముందుగానే పింఛన్ డబ్బులు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆసరా పింఛన్లు	లబ్ధిదారులు
వృద్ధాప్య పింఛన్లు	52,586
వితంతు పింఛన్లు	53,231
వికలాంగుల పింఛన్లు	18,896
చేనేత పింఛన్లు	604
కల్లుగీత పింఛన్లు	815
బీడీ కార్మికుల జీవనభృతి	36,980
ఒంటరి మహిళలకు భృతి	4,775
ఎయిడ్స్ బాధితులు	1,406
ఫైలేరియా బాధితులు	574
మూత్రపిండ వ్యాధిగ్రస్తులు	119
మొత్తం	1,69,986

కష్టం అవుతోంది



వేలిముద్రలు రావడం లేదు. దీంతో పింఛన్ తీసుకోవడానికి కష్టం అవుతోంది. పంచాయతీ కార్యదర్శి సారు టైముకు దొరుకుతలేరు. ఆఫీసుకాడికి చాలాసార్లు పోవాల్సి వస్తోంది. వేలిముద్రలు రానోళ్లకు ముందుగనే పింఛన్ ఇవ్వాలి. -లక్ష్మి, రామేశ్వర్‌పల్లి

ఖాతాల్లో వేయాలి..



చాలామందికి వేలిముద్రలు వస్తలేవు. ఇలాంటివారికి పెన్షన్ డబ్బులను బ్యాంకు ఖాతాల్లో వేయాలి. సర్కారు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. డబ్బులు బ్యాంక్‌లో వేస్తే మాకు ఎంతో మేలు జరుగుతుంది. -విఠల్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- జిల్లాకేంద్రంలో ధ్యాన శిబిరం ప్రారంభం



ధ్యాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కామారెడ్డి క్రైం: ధ్యానం శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిశు మందిర్ హైస్కూల్ ఆవరణలో రామచంద్ర మిషన్‌కు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో 'హరి దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్' శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దినచర్యలో భాగంగా ధ్యానం, యోగాసనాలు, ముద్రలు సాధన చేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా బీపీ, మధుమేహం, ఒత్తిడి, థైరాయిడ్, ఊబకాయంలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ శిక్షణను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షకులు కమలేష్ పటేల్, కోఆర్డినేటర్ కృష్ణారావు యోగాతో ప్రయోజనాలను వివరించారు. చిన్నతనంలోనే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పి వివేకవంతులుగా మార్చాలని సూచించారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కార్యక్రమంలో వివేకవర్ధిని పుస్తకాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. ధ్యాన శిబిరం ప్రతినిధులు సురేందర్, బాల్ రెడ్డి, లక్ష్మి, శిరీష, నగేష్, అనిల్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రీడింగ్ రూంలు..

కామారెడ్డి క్రైం: గ్రామాల్లో రీడింగ్‌రూంలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీలలో రీడింగ్ రూమ్‌ల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ రీడింగ్ రూంలలో ఫర్నిచర్, దినపత్రికలు, మహనీయుల చరిత్రకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, డీఈవో రాజు, డీఎల్‌పీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. దేవునిపల్లి శివారులో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. మెడికల్ కళాశాల విద్యార్థుల వసతి గృహాల ఏర్పాటు కోసం రెండు అద్దె భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

పదోన్నతులు రద్దు

- రెండో రోజు మరిన్ని చర్యలు చేపట్టిన తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్
- పాత స్థానాల్లోకి ఇద్దరు అసిస్టెంట్‌లు, 23 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది
- కాంట్రాక్ట్ అధ్యాపకుడి నుంచి రూ.9,95,428ల రికవరీకి ఆదేశం
- డబ్బులు చెల్లించకుంటే క్రిమినల్ కేసు!



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి (ఈసీ) నిర్ణయాల అమలులో భాగంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి శుక్రవారం మరిన్ని చర్యలు చేపట్టారు.ఈసీ అనుమతి లేకుండా వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ పలువురు నాన్‌టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. వారిలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు భాస్కర్, ఉమారాణి పదోన్నతులను రిజిస్ట్రార్ రద్దు చేశారు. ఇకపై వారు సూపరింటెండెంట్ లుగా విధులు నిర్వహిస్తారు. వారిద్దరికీ ఏరియర్స్ కింద చెల్లించిన డబ్బులను వారి వేతనం నుంచి రికవరీ చేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అలాగే అకడమిక్ కన్సల్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వి శ్రీనివాస్‌ను ఏపీఆర్‌వోతో పాటు ఇన్‌కమ్ టాక్స్ కోఆర్డినేటర్‌గా గతంలో వీసీ నియమించగా ఆ రెండు పదవులను రద్దు చేస్తూ రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించడంతో పాటు అతడి ఖాతాలోకి రూ.9,95,428 వేసి డ్రా చేసుకున్నారు. 15 రోజుల్లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అకౌంట్‌లోకి ఆ మొత్తం డబ్బులు జమచేసి రసీదు అందజేయాలని, లేనిపక్షంలో శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్‌లో పని చేస్తున్న 23 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వీసీ కల్పించిన పదోన్నతులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎరియర్స్ పేరిట చెల్లించిన డబ్బులను వారి వేతనం నుంచి రికవరీ చేస్తామన్నారు. తెయూ డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌లో 129 మంది, భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌లో 16, సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో ఇద్దరు, మొత్తం 147 మంది వివిధ విభాగాల్లో డెయిలీవేజ్ లేబర్ పేరిట పనిచేసిన సిబ్బందిని గురువారం నుంచే విధుల్లోకి రావద్దని తెలిపామన్నారు. ఈ మేరకు అన్ని విభాగాలకు సమాచారం ఇచ్చినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

■ ప్రైవేటు పీఏకు యూనివర్సిటీతో సంబంధం లేదు..

వీసీ రవీందర్ ముడుపుల వసూళ్లు, కమీషన్ల బేరసారాల కోసం ఏకంగా ఒక ప్రైవేటు పీఏను నియమించుకున్నారు. ఆన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్టు (ఏఎంసీ) ద్వారా యూనివర్సిటీలో కంప్యూటర్స్, ప్రింటర్స్, జిరాక్స్ మిషన్లు తదితర పరికరాలను మరమ్మతు చేసే పనులు దక్కించుకున్న వ్యక్తి తర్వాత కాలంలో వీసీకి ప్రైవేట్ పీఏగా మారాడు. వీసీకి సంబంధించి ఏ పనులు కావాలన్నా ఇతడిని కలవాల్సిందే. కొద్ది నెలలుగా వీసీ వెంటే ఉండి అన్నీ తానై వ్యవహరిస్తూ షాడో వీసీగా పేరు పొందాడు. పదోన్నతులు, నియామకాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి ముడుపులు వసూలు చేసి వీసీ కి అందజేసేవాడని బహిరంగంగా ఆరోపణలున్నాయి. సదరు వ్యక్తి ఇక నుంచి వీసీ రెసిడెన్సీ, ఛాంబర్ వద్ద కనిపించవద్దని వీసీ పీఏ కు రిజిస్ట్రార్ యాదగిరి స్పష్టం చేశారు. ఈసీ సమావేశం రోజు నుంచి ఆ ప్రైవేటు పీఏ క్యాంపస్‌లో కన్పించడం లేదు. పోస్టును బట్టి డబ్బులు వసూలు చేసిన అతడి కోసం డెయిలీవేజ్ సిబ్బంది ఎదురు చూస్తున్నారు. సోమవారం వీసీ రవీందర్ యూనివర్సిటీకి వచ్చే అవకాశం ఉందని తెలియడంతో నియామకాల కోసం డబ్బులు ఇచ్చిన వారందరూ అతడిని కలిసి తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగేందుకు సిద్ధమవుతున్నారు.

వీసీ లేకుంటే రెసిడెన్స్‌కు తాళం

తెలంగాణ యూనివర్సిటీ వీసీ సౌకర్యార్థం క్యాంపస్ ఆవరణలో నిర్మించిన వీసీ రెసిడెన్స్‌లో అదనపు సిబ్బందిని రిజిస్ట్రార్ యాదగిరి తొలగించారు. వీసీ రెసిడెన్స్‌లో కేవలం అటెండర్, కుక్, స్వీపర్ మాత్రమే విధులు నిర్వహించాలని ఆదేశించారు. వీసీ స్థానికంగా లేని సమయంలో రెసిడెన్స్‌కు తాళం వేసి రిజిస్ట్రార్ కార్యాలయంలో అప్పగించాలని సిబ్బందికి సూచించారు. వీసీ ఛాంబర్‌లో పీఏ, అటెండర్, స్వీపర్ మాత్రమే విధులు నిర్వహిస్తారని తెలిపారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా వీసీ రవీందర్ పీఏలు, అటెండర్ల పేరుతో తన రెసిడెన్స్‌లో 8 మందిని, ఛాంబర్‌లో 8 మందిని నియమించుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఈసీ సమావేశంలో సభ్యులు వీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై కేవలం రెసిడెన్స్‌లో, చాంబర్‌లో ముగ్గురు చొప్పున మాత్రమే విధులు నిర్వహించేలా నిర్ణయించారు.

అమరులకు నివాళి



ఎల్లారెడ్డిలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి కోసం శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది.

రైతన్నను ఆగం చేసిన వాన

- నేలకొరిగిన వరి పంట
- పలు గ్రామాల్లో తడిసిన ధాన్యం
- రాలిన మామిడికాయలు
- ఆందోళన చెందుతున్న రైతులు

అకాల వర్షం అన్నదాతలను ఆగం చేస్తోంది. నిజామాబాద్ జిల్లాలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. మరో నాలుగు రోజుల్లో కోయాల్సిన వరిపొలాలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.


కమ్మర్‌పల్లిలో రాలిపోయిన మామిడికాయలను కుప్పపోస్తున్న రైతులు


రాణాకలాన్‌లో నేలకొరిగిన వరి


నీలాలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు, రైతులు


మాక్లూర్ మండలం అమ్రాద్‌లో నేలవాలిన వరి పంట

నందిపేట్: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. నందిపేట మండలంలో గురువారం రాత్రి 13 ఎం.ఎం. వర్షపాతం నమోదయింది. సుమారు 28 వేల ఎకరాలలో వరిపంట, 7 వేల ఎకరాలలో ఆరుతడి పంటలు వేయగా ఈ పాటికే ఆరుతడి పంటలు సగానికి పైగా భయటపడ్డాయి. వరి కోత దశలో నేలకొరిగింది. ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. మామిడికాయలు రాలిపోగా, నువ్వు పంట నేలకొరిగింది.

మాక్లూర్: మండలంలోని కృష్ణనగర్‌లో ఈదురుగాలులతో గురువారం రాత్రి పార్ట్ సర్క్యూట్ అయి దేదావత్ ఉమ్లాకు చెందిన గడ్డివాము కాలిపోయింది. కోతకు వచ్చిన పంటలు గాలివానకు నేలకొరిగాయి. చింతకాయలు, మామిడికాయలు నేల రాలిపోయాయి.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలంలోని పిప్రి రోడ్డులో రైతు తోటలో మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. మామిడిపల్లిలోని ఆదర్శనగర్‌లో ఓ ఇంటిపైన వేపచెట్టు నేలకొరిగింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు.

రెంజల్: వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. గాలులకు చెట్లు విరిగి విద్యుత్ తీగల పై పడటంతో ట్రాన్స్‌కో సిబ్బంది రాత్రి శ్రమించి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయిందని, షరతులు లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు మామిడి, నువ్వు పంటలకు నష్టం వాటిల్లింది. కమ్మర్‌పల్లి, ఉప్లూర్, చౌట్‌పల్లి క్లస్టర్ల పరిధిలోని మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలగా, నువ్వు పంట నేలకొరిగింది. మామిడి పక్వం దశలో సగానికి పైగా కాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు నువ్వు పంటలను పరిశీలించి 33 శాతం లోపు పంటకు నష్టం వాటిల్లినట్లు నివేదిక రూపొందించారు.

మోపాల్: మండలంలో వరి పంట నేలకొరిగింది. శుక్రవారం మండలంలోని మంచిప్ప, నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి, బాడ్సి, మోపాల్, తదితర గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారులు పర్యటించారు. సుమారు 70 ఎకరాల్లో వరి నేలకొరిగిందని పేర్కొన్నారు. అలాగే తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టాలని సూచించారు. గాలులకు మామిడి, చింతకాయలు నేలరాలాయి. కొన్ని గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది.


ఉప్లూర్‌లో నేలకొరిగిన నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పసుపు రైతు కన్నీరు




తడిసిన పసుపును ఆరబెడుతున్న రైతు శంకర్

జగిత్యాల జిల్లా కొనాపూర్ గ్రామానికి చెందిన రైతు శంకర్ మూడు ఎకరాలు కౌలు తీసుకొని పసుపు సాగు చేశాడు. పంటను అమ్మడానికి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం తీసుకవచ్చాడు. గురువారం బీట్ కాగా క్వింటాలుకు రూ.4,200 పలుకగా, నాణ్యతగల పసుపు తక్కువ ధర రావడంతో వ్యాపారులకు విక్రయించలేదు. ఎక్కువ ధర వస్తుందనే ఆశతో 71 సంచుల పసుపుపంటను మార్కెట్‌లో ఉంచాడు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి శంకర్ తీసుకవచ్చిన పసుపుకొమ్ములు తడిసిపోయాయి. చేతికి వచ్చిన పసుపు తడిసిపోవడంతో రైతు పసుపును చూసి కన్నీరుమున్నీరయ్యాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


సింగంపల్లిలో రాలిపోయిన మామిడికాయలు


మామిడిపల్లి ఆదర్శనగర్‌లో కూలిపోయిన చెట్టు


నందిపేట విజయనగర్ శివారులో నేలకొరిగిన వరి పంట

క్లుప్తంగా

మే 1 నుంచి టీసీసీ శిక్షణ తరగతులు

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) శిక్షణ తరగతులు మే 1 నుంచి జూన్ 11 వరకు ఉంటాయని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థి చేరబోయే కోర్సుల్లో లోయర్ గ్రేడ్ టీటీసీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అడ్మిషన్ల కోసం bse. telangana. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందాలని, అనంతరం పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

జూన్ 1న డీసెట్

నిజామాబాద్‌అర్బన్: డీసెట్ పరీక్షను జూన్ 1న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుకు సంబంధించి ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మే 22 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

25న జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 25నే ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లోని ఐటీసీలో ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఐటీఐ, వొకేషనల్ కోర్సు, సిల్క్ ట్రైనింగ్ ఆపైన చదివి, 30 ఏళ్లోపు వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు శివాజీనగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 6305743423, 9581768413, 9959456793 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలలకు సంబంధించి బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్స్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు మే 3 వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో మే 4 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో మే 6 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో మే 8 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

బీపీఈడ్ పరీక్షలు ప్రశాంతం

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన బీపీఈడ్ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కంట్రోలర్ తెలిపారు. మొత్తం 22మంది విద్యార్థులకు 18మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: రాష్ట్ర రోడ్లు–భవనాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ముస్లింలకు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి కథల పోటీల్లో ప్రథమ బహుమతి



కామారెడ్డిరూరల్: రాష్ట్రస్థాయి కథల పోటీలో దేవునిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి బొమ్మెర అనీల ప్రథమ బహుమతి సాధించింది. పత్తిపాక ఫౌండేషన్ సిరిసిల్ల, గరిపెల్లి ట్రస్ట్ భీముని మల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీలావతి దవే సైన్స్ ఫిక్షన్' కథల పోటీల్లో అనీల బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం గంగకిషన్ తెలిపారు. సంస్థ వారు అందించిన రూ.500, ప్రశంసా పత్రం శుక్రవారం పాఠశాలలో విద్యార్థికి అందజేశారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- 28 నుంచి నిరవధిక సమ్మె
- కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

సుభాష్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేయాలని, గడిచిన నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని జేపీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పని చేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో అమల్జేస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రతి కార్యదర్శి క్రియాశీలకంగా పని చేశారన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు రావడంలో జేపీఎస్‌లు ముఖ్య భూమిక పోషించారని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్లు కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో భానుక చంద్రశేఖర్, సుమన్, హనుమాన్ రాజు, హేమ, కృష్ణవేణి, గౌతమి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నెలవారి సమీక్షాలో భాగంగా ఆయన శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవికాలం దృష్ట్యా దొంగతనాల నివారణ కోసం ప్రజలందరికీ అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించే అప్లికేషన్ గురించి స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఐటీ కోర్ సిబ్బంది ద్వారా వివరించారు. అదనపు ఎస్పీ అన్యోన్య పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ఆరబోస్తుండగా..

గుండెపోటుతో రైతు మృతి


సాయన్న (ఫైల్)

మాక్లూర్: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తుండగా గుండెపోటు వచ్చి శుక్రవారం ఓ రైతు మృతి చెందాడు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన సాయన్న (48)కు భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయన్న గతంలో బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటూ తనకున్న ఎకరంతో పాటు ఇతరుల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. పంటను కోసి ఆరబెట్టగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. శుక్రవారం ఉదయం తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తుండగా సాయన్న ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు.

ముదిరాజ్‌లు ఐక్యంగా సాగాలి



దోమకొండ: ముదిరాజ్‌లు ఐక్యంగా ముందుకు సాగి, రాజకీయంగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం దోమకొండలో ముదిరాజ్ గద్దెను ఆవిష్కరించి బైక్ ర్యాలీ తీశారు. అనంతరం పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పున్న లక్ష్మణ్, పున్న రాములు, అబ్రబోయిన రాజు, కదారి రమేష్, కొండ శ్రీను, బొయిని సత్యం, కామిండ్ల రాములు, బట్టు శంకర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు

- ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: ఇందూరు క్రీడాకారులు నిఖత్ జరీన్, యెండల సౌందర్య అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని జీజీ కళాశాల ఆవరణలో శుక్రవారం క్రికెట్ నెట్ ప్రాక్టీస్ పిచ్‌తో పాటు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులకు వేదికగా నిజామాబాద్ మారిందన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ మాయవార్ సవిత రాజు, సాయిరాం, జీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మోహన్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యం పెంపొందించుకోవాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఇందిర, ప్రొఫెసర్లు, విద్యార్థులు

నిజామాబాద్ సిటీ: మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర అన్నారు. శుక్రవారం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు మనోధైర్యం–ఒత్తిడి నివారణ కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు వ్యాయామం కోసం అధునాతన జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. రిలాక్సేషన్ కోసం స్పోర్ట్స్ క్లబ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విశాల్, నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల మానసిక విభాగం అధిపతి శివప్రసాద్ మనోధైర్యం పెంపొందించుకోడం, ఆత్మహత్య నివారణ మార్గాలు, రిలాక్సేషన్ థెరపీ వంటి విధానాల గురించి వివరించారు. వైద్యులు గోపాల్ సింగ్, తిరుపతిరావు, దినేష్, ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్, రాజేందర్, రవికాంత్, కిశోర్, రవితేజ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రాణాలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


సంతోష్(ఫైల్)

తాడ్వాయి: తాడ్వాయి రాణా ఆవరణలో ఆత్మహత్యకు యత్నించిన గ్రామానికి చెందిన లాలమ్మల సంతోష్(35) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 19న రాత్రి సంతోష్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని పోలీసు స్టేషన్ ఆవరణలో నిప్పంటించుకున్నాడు. 90శాతం గాయాలతో బాధపడుతున్న సంతోష్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడని చెప్పారు. మృతుడికి భార్య సోనీ, ఏడాది కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..


జోగు నర్సింలు(ఫైల్)

తాడ్వాయి: ఆత్మహత్యకు యత్నించిన తాడ్వాయికి చెందిన జోగు నర్సింలు(36) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నర్సింలు కొన్ని రోజుల నుంచి తాగుడుకు బానిసై అప్పులు చేశాడన్నారు. భార్య బంగారం, పట్టగొలుసులను కూడా తాకట్టుపెట్టి మద్యం తాగాడు. ఈ క్రమంలో ఈ నెల 18న మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యులు నిజామాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య వినోద, కూతుర్లు రక్షిత, రిశ్విత ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: వృద్ధురాలిని హత్య చేసిన ఒకరికి జీవిత ఖైదు ఖరారు చేస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం తీర్పును వెల్లడించారు. కేసు వివరాలు.. నిజామాబాద్ నగరంలోని నాగారం వడ్డెర కాలనీకి చెందిన పల్లపు మల్లేశ్ ఆటో నడుపుతూ, దొంగతనాలే వృత్తిగా జీవిస్తున్నారు. 2019 జూలై 2న సీతారామ్ నగర్ కాలనీకి చెందిన పుట్టి సాయమ్మ అనే వృద్ధురాలిని బంగారు నగల కోసం హత్య చేశాడు. మరుసటి రోజు కరీంనగర్ జిల్లా రామగుండంలోని తన చిన్నాన్న కొడుకు పల్లపు బాలయ్య దగ్గరకు వెళ్లాడు. ఆ నగలను చోరీ చేసి తెచ్చినట్లు చెప్పి ఆయన పేరు మీద ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టి రూ. 62 వేలు లోన్ తీసుకున్నాడు. కోర్టు విచారణలో మల్లేశ్‌పై నేరారోపణలు రుజువైనట్లు నిర్ధారిస్తు హత్య కేసులో జీవిత కారాగార శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధించారు. బంగారు నగలు దొంగిలించినందుకు ఐదు సంవత్సరాల కఠిన జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఒకటి కంటే ఎక్కువ నేరాలు చేసినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. రెండో ముద్దాయి పల్లపు బాలయ్య దొంగ సొత్తని తెలిసి ముత్తూట్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకున్నందుకు ఆయనకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

నవీపేట: మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన లక్ష్మి(50) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి శుక్రవారం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుందని పేర్కొన్నారు. ఆమెకు భర్త ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరద కాలువలో గుర్తు తెలియని మృతదేహం

మోర్తాడ్: మోర్తాడ్ శివారులోని వరద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతుడి ఆనవాళ్లు ఏమి లభించకపోవడంతో మృతదేహాన్ని ఆర్మూర్ మార్చురిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. కాలువలో పడి చనిపోయినట్లు భావిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత


శ్రీనివాస్ (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్ప చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలకు చిక్కు కుని పల్లికొండ శ్రీనివా స్ (38) శుక్రవారం మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేప లు పట్టే క్రమంలో వల చుట్టుకుని చెరువులోముని గి ఊపిరాడక మృతిచెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చెరువు పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ దొరకక పోవడంతో శుక్రవారం ఉదయం వెళ్లగా కట్టపై బైక్, దుస్తు లు, చెప్పులు లభించాయి. శ్రీనివాస్ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

భిక్కనూర్: మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన లొంగడం శంకర్ శుక్రవారం చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కాలకృత్యాలకు వెళ్లి కాలు జారి చెరువులో పడ్డాడని, ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడని చెప్పారు. ఈ మేరకు మృతుడి భార్య వీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.